


బొమ్మలు : శ్రీ 'బాపు'

''ఏడుకొండలవాడా ! వెంకటరమణా గోవిందా ! గోవిందా'' అనుకుంటూ తిన్నగా తిరుపతి చేరి ఎకాఎకిని ఆ ఊళ్లోనే ఉంటున్న మా సౌందేవమ్మత్తగారింటి కెళ్లాను

బొత్తిగా తలమాసినవాడిలా ఉన్న నన్ను చూసి 'పరీక్ష క్షవరంకాకుండా కాపాడినదరుకు స్వామి సమక్షంలో నున్నగా (అంటే దూరపు కొండలా) క్షవరం చేయించుకోడానికి వచ్చి ఉంటాడు ' అనుకున్నారు మా సౌందేవమ్మత్తా అండ్ ఫెమిలీ

కక్కు వచ్చినా, కల్యాణం వచ్చినా ఆగ దన్నారు పెద్దలు క్షవర కల్యాణం విషయం కూడా అంతేనేమో !! 'కళ్యాణకట్ట' నేను వెళ్లేసరికి చాలా హడావిడిగా ఉంది భక్తులంతా వరుసగా కూర్చుని 'గుండ్లు' చేయించు కుంటూంటే చూడముచ్చట వేసింది నా మట్టుకు నాకు గడ్డం మీసాలతో బూచాళ్లల్లా వచ్చిన వాళ్లందరూ 'సానపట్టిన వజ్రాల్నాటి' గుళ్లతో మెరుస్తూ వెళ్లిపోతున్నారు

''ఆహా !'' అని ఆనందతన్మయుణ్ణి అవుదామనుకునే లోపులో ''ఏంది స్వామీ ! అలా దిక్కులు చూస్తూవుండావ్ ?'' అని నన్ను లాక్కెళ్లి బలవంతాన కూర్చోపెట్టి గుండు గీసెయ్యడం మొదలు పెట్టాడు బీజపూర్ సుల్తానులా ఉన్న ఒకానొక ''మంగలిమంత్రి''

నాకు చెడ్డ సిగ్గేసింది గుండు గీయించు కుంటుంటే తాళికట్టించుకునే పెళ్లికూతురిలా సిగ్గుతో తలొంచేసుకున్నాను (అసలు ఆ మాట కొస్తే ఈ రోజుల్లో పెళ్లికూతుళ్లు కూడా నాలా వంచుకోరు అయినా మహామహావాళ్లే మంగలి ముందు తల వంచాలిగా అని సరిపెట్టు కున్నా )

గుండు గీయడానికి అట్టేసేపు పట్టక పోయినా ఆ కాస్సేపు నిశ్శబ్దంగా కూర్చోలేక —

''నువ్వు రోజుకి ఎన్ని గుళ్లు గీస్తావు!!?'' తల వంచుకునే అడిగాను

''ఎంత లేదన్నా మామూలు రోజుల్లో రెండు, మూడు డజన్లు గీస్తాను ''

''ఏమిటి !? దీనికి మామూలు రోజులూ— ప్రత్యేక రోజులూ ఉంటాయేమిటి ?''

''ఉంటాయండి పరీక్ష రిజల్ట్సు వచ్చే రోజులు చూడాలి ఇసుకవేస్తే రాలరు జనం తండోపతండాలు కదండీ ''

ఇంకా ఏదో అడుగుతుంటే 'పూర్తయ్యింది' అన్నాడు

చెయ్యి అనుకోకుండా నెత్తిమీదకు వెళ్లింది 'సొగసైన క్రాపు పోయిందని' తెలుసుకోడానికి క్షణంలో సగం సమయం పట్టలేదు

''నీటిబొట్టు ఆగదంటే నమ్మండి'' అన్నాడు మంగలి.

అదెంత నిజమోనని ఓ రెండు నీటిబొట్లు 'గుండు'మీద వేయించాను అవి జారటం మాటెలాఉన్నా వుండుమీద కారం జల్లినంత మంట పుట్టింది. 'బాధ భరించలేక అమ్మో' అన్నాను.

''నేను నయమండి మిగతావాళ్లయితే చిత్రి ఫట్టేద్దురూ. . నలభై ఏళ్ల సర్వీసు'' అన్నాడు.

రోజుకు రెండు డజన్ల చొప్పన నలభై ఏళ్లకు ఎన్ని గుళ్లు ! గీశాడో !?

నిజమేనేమో ! మరి అనుకుంటూ మరో సారి నా గుండును తనివితీరా చేత్తో రాసుకుం టూంటే వెనుకనుంచి ఎవరో ''సాక్షాత్తూ కుమారస్వామిలా ఉన్నాడు'' అనుకుంటున్నారు. (కుమారస్వామికి గుండు అవునా, కాదా అవి ఆలోచించండి. మరి)

'నున్నటి గుండు' చూస్తే ఎవరికైనా సరె ఒక్కసారి చెయ్యి వెయ్యాలనిపిస్తుంది. (వెనుకటికి ఒకరు (గుండాయన) ఎవరో మరొకర్ని అడిగారుట ''నీ తీరని కోరిక ఏమిటి !?'' అని అంటే రెండో ఆసామీ జవాబిచ్చాడుట ''మీలాంటివాళ్ల నున్నటి గుండు మీద 'ఐస్'మీద జారినట్టుగా జారాలనిపిస్తుంది' అని). సరసులు సంగీత పాఠకులైతే 'రామ కీర్తన' పాడేస్తే !? అన్పిస్తుంది గుండు చూడగానే.

ఇంటికి రాగానే (కొండదిగి) సౌందేవమ్మత్త నా గుండు 'చలిమిడి ముద్దలా ఉంది' అంది. అంతవరకూ 'నా గుండు తడిమీ చూసు కున్నానేకాని— ఆ గుండు సౌందర్యాన్ని సరిగా తిలకించే భాగ్యం నాకు అప్పటివరకూ కలగ లేదేమో. ఎదురుగా కనుపించిన నిలువుటద్దం ముందర నిలుచున్నాను.

గుండుకి కొంచెం మానెతడి తగిలింది కాబోలు . చుట్టుపక్కల్నించి సూర్యకాంతి కిరణాలు 'గుండు'మీద పడి ప్రతిఫలిస్తుంటే ప్రకృతి సౌందర్యం అంతా నా గుండు మీదే ఉందేమో ! అనిపించింది. (దగ్గరగా ఎవ్వరైనా వచ్చి నా గుండువైపు చూస్తే తప్పకుండా వారి ప్రతిబింబం కన్పిస్తూంది— అనుకున్నాను )

బాబిగాడు ''బోడిగుండు బొప్పాసిగుండు''

గుండు కథ. . . .

అని లోలోపలే అనుకున్నాడు బొబ్బాసి గుండేమిటి!? గాడిద గుడ్డు

అంత అందమైన గుండుని ఎండవానలకు వదిలేస్తే దాని సొగసు తగ్గిపోతుంది కదూ !! అందుకని దానికి తగిన 'గుండురక్ష' ఏదైనా కొనడానికి బజారుకి బయలుదేరాను

స్వరాజ్యం సంపాదించిన రాజ్యంలా తల యొక్క ఉపరితలం స్వేచ్ఛా వాయువులు పీలుస్తోంది రోడ్డుమీద నడుస్తూంటే మనస్సు పరిపరివిధాల పోయింది రకరకాలైన ఆలోచనలు ప్రారంభమయ్యాయి

"అందుతే జుట్టు లేకపోతే కాళ్ళూ పట్టుకునే వాళ్ళు కూడా మనల్ని ఏమీ చెయ్యలేరు ఎందుకంటే మనకి గుండు కాబట్టి మన పిలక వాడి చేతిలో ఉంటే' అనే భయం అసలే లేదు అసలు 'పిలక' అనేది భూగోళ పరిశీలకుల దృష్టిలో ఏ చెట్టూ లేని ఎడారిలో ఆముదం చెట్టు లాంటిది మొన్న మొన్నటిదాకా ఉపనయనం వేయించుకున్న వాళ్లకి ఈ పిలక బాధ తప్పేది కాదు అయినా ఒక పిలక అయితే ఫరవాలేదు ఒకడి చేతిలోనే ఉంటుంది పంచ శిఖలూ అయిదుగురి చేతుల్లో పడితే 'ద్రౌపది' లాగ బాధపడవలసి వస్తుంది.

మరీ పూర్వకాలంలో 'పతి'ని కోల్పోయిన 'సతి' ఈ బాధ భరించలేకనే కాబోలు 'సహగమనం' చేసేదట

రానురాను "ప్రజలు గుండు విలువ గుర్తించారు ఏకమత్యంతో పోనుపోను ఇంకా గుర్తిస్తారు దేశం అభివృద్ధిలోకి వస్తుందని అభిజ్ఞ వర్గాలవారు అనుకుంటున్నారు" అని ఆయనెవరో ఉద్ఘాటిస్తూ ఇలా అన్నారు—ఇంకా ఇలా అన్నారని ఇంకో ఆయనెవరో చెప్పారు.

"గండపెండేరాలు వేయించుకున్న గుండు కవులెందరో బ్రహ్మాండంలో ఉన్నా అందాన్ని ఆనందాన్ని పిండి—గుండకొట్టి 'గుండు'లాగ చేసి సదరు 'గుండు'కి 'చందమామ' అని చక్కగా పేరెట్టుకుని తమ కావ్యాల్లో వర్ణించుకున్నారు అటువంటి చంద్రుడిలోనైనా మచ్చలు ఉంటాయి గాని—సిసలైన గుండు మాత్రం వంకలేని నెల వంకలాగ ఉంటుంది

అందుకనే కవి కుమారులు మన గుండుని కురిడీతో మిళాయించి ఉప్మాలంకారం చేసేస్తారు

కవిత్వం లాగానే కొంతమందికి గుండుకూడా సహజంగానే వస్తుంది అటువంటి గుండుని 'బట్టతల' అంటారు వాటిల్లో మళ్లీ చాలా రకాలున్నాయి

కొంతమందికి చూడముచ్చటగా 'వరండా' లాగ కొంచెం బట్టతల — అదైనా కేవలం లాంఛనప్రాయంగా ఉంటుంది

మరికొందరిలో నుదురు ముదరి అంటు వ్యాధిలాగ, లేకపోతే విజయనగర సామ్రాజ్యంలాగ విస్తరించి, సముద్రంలాగ లోపలికి చొచ్చుకుని పోతుంది

కొందరికి "మండువా"లాగ తల మధ్యలో ఉంటుంది బట్టతల అరుదుగా కొందరికి పాల రాతి కోటలాగ మధ్యలో 'నిగనిగలాడే గుండూ'— ప్రహరీ చుట్టూ కందకంలాగ ఓ వరస వెంట్రుకలూ ఉంటాయి అటువంటి బట్టతలలున్న

వాళ్ళు శీతాకాలంలో పెళ్లికి వెళ్లినప్పుడు పన్నీరు జల్లితే చలివేస్తుంది

ఎండాకాలంలో తామరాకుమీద నీటిబొట్టుల్లాగ చెమట పడుతుంది అసలు ఈ బట్టతలలు స్థిరాస్తుల్లాగ తాతముత్తాతల దగ్గర నుంచి సంప్రాప్తిస్తాయని జనన శాస్త్రజ్ఞులంటారు

అందుకనే కాబోలు—పురాతన వస్తుసామగ్రి మీద అభిమానం కలవారికి మన గుండు కొత్తగా గిలాబా చేయించిన 'సాంచీ' స్థూపంలాగ అనస్తుంది

శాస్త్రజ్ఞులకి మటుకు కాంక్రీటు చేయించిన విమాన ఆశ్రయం జ్ఞాపకం వస్తుంది జీవశాస్త్రజ్ఞులకి గుండుని చూస్తే రకరకాలైన గుడ్లూ, గుండెలూ జ్ఞాపకం వస్తాయి వాటికీ, వీరికీ అవినాభావ సంబంధం — అదీ సంగతి

గుండుకి ఇంత ప్రత్యేకత ఉన్నా తిరుపతి

వీధుల్లో మనల్ని ఆట్టే పట్టించుకోలేదు ఎవ్వరూ ఎక్కడ చూసినా గుండూ, గుళ్లూ, గోపురాలు, శతకోటి లింగాల్లో మనమూ ఓ బోడిజంగాలం అయితే మటుకు!? ఎవడి గుండు వాడికి ముద్దు (గిరీశంగారు చెప్పినట్టు 'సజీవ సాలగ్రామం' కదా )ఆలోచిస్తూ నడుస్తున్న నాకు గుండుతో స్నేహితుడొకడు ఎదురయ్యాడు వీధి మలుపులో అతి కష్టంమీద ఒకరినొకరు పోలిక పట్టుకున్నాం

ఇద్దరం కలసి పోతుంటే "జోడు గుండ్ల పిస్తోలు — ఠా" అన్నారు వెనుకనించి- ఎవరో వెనక్కు తిరిగి చూశాం

"గుండు డు, ము, వు, లు ప్రథమా విభక్తి" అనేసి పారిపోయా డొక హైస్కూలు విద్యార్థి

'ఏదో చాలాకాలానికి కలిసాం కదా' అని కూల్ డ్రింకు తాగడానికి ప్రక్కనే ఉన్న డ్రింక్ షాపులోకి వెళ్లాం డ్రింక్ త్రాగుతూ తల ఎత్తేసరికి అన్నీ గుండ్లే చుట్టూ అద్దాలు ఎటు చూసినా, నా గుండూ లేకపోతే మావాడి గుండూ ఎదురుగా చూశాను పంపరపనస కాయల్లాటి గుండుల పరంపర వెనకో అద్దం, ముందో అద్దం పైకి చూస్తే అక్కడా గుండ్లే మాకు గాభరావేసి బయటికి వచ్చేశాం

ఉన్నట్టుండి "ఏమిటాలోచిస్తున్నావ్ ?" అనడిగాడు వాడు "గుండు గురించి" అన్న నా జవాబుకి "ఇదొకటి కోతికి కొబ్బరికాయ దొరికినట్టు" అన్నాడు (అసలు నా గుండు చూస్తే ఆ గుండుకి అసూయ కాబోలు).

దగ్గర్లో ఉన్న కొట్టుకెళ్లి "ఇక్కడ టోపీలు " అని అడగబోతూంటే

"మీకా సందేహం అక్కర్లేదు, దయ చేయండి" అన్నాడు కొట్టువాడు

పైగా "మంచి పొకెట్టు దువ్వెనలున్నాయి ఇమ్మంటారా! ?" అని వాడే అడిగాడు నాకు అరికాలు మంట నడిగుండు కెక్కింది (నడి నెత్తికి అనడానికి — అప్పుడు నాకున్నది గుండే కదూ !)

''వెధవ్విల్లెయ్యక టోపీలుంటే ఏడవ మన్నా''ను

వాడు ఏడుస్తూనే ముందు నా 'గుండు' ఉపరితలాన్ని పరిశీలించాడు 'టేప్'తో చుట్టు లత చూసాడు ఘనపరిమాణం లెక్కల్లో ఇంటి కప్పుకేసి చూస్తూ ఏదో మంత్రాలు చదువుతున్నట్లు మొహం పెట్టాడు దూలాలు లెక్కపెడుతున్నాడేమో! అనుకున్నా

''సైజు నెంబరు ఇరవైరెండు సరిపో తుంది'' అన్నాడు చివరికి ఏదో సాధించినవాడిలా

అక్కడితో ఊరుకోక టోపీ వెయ్యడం ప్రారంభించాడు

'గాంధి టోపీ పెట్టుకుంటే అచ్చు నెహ్రూగారిలాగ ఉంటానట సేట్‌జీ టోపీ పెట్టుకుంటే అచ్చు హిందీ సినిమా యాక్టర్లా ఉంటానుట ఈవెనింగ్ హేట్ పెట్టుకుంటే సాక్షాత్తూ మన్మధుడు యూరోపియన్ డ్రెస్సులో వచ్చినట్టుంటానట,'

ఇంకా ఏదో చెప్పబోతుంటే ''గుండుతో ఉంటే హాలీవుడ్ స్టార్‌లాగా ఉంటా, అయినా ప్రమాదమే ఎవరూ పోలికపట్టలేరు ఏం చేస్తాం!?'' అని కొట్లోంచి బయటికి వచ్చి అత్తయ్యగారింటికి వచ్చేసాను

సేమియా పాయసం తాగి సొందేనమ్మత్త దగ్గర సెలవు తీసుకుని సామాన్లు పట్టుకుని తిరుగుప్రయాణానికి స్టేషన్ దగ్గర కొచ్చాను

అక్కడ ఒక అమాయకుడు వెర్రిగా నాకేసి (అంటే నా గుండుకేసి) చూడ్డం మొదలు పెట్టాడు 'పోనీలే పాపం నాలో ఏమైనా 'దలైలామా' పోలికలు కనిపిస్తున్నాయేమోలే' అనుకున్నాను

దగ్గరగా వచ్చి చెయ్యెత్తుతున్నాడు

ఇదేమిట్రా బాబూ! కొడతాడేమిటి చెప్మా కొంపతీసి —

మెత్తనిగుండు చూస్తే మొత్తబుద్ధి వేసిందేమో? అనిపించింది

తీరా చూస్తే చెయ్యెత్తి నమస్కరించాడు 'ఎందుకు నమస్కరించావ్?' అని అడుగుతే బాగుండదని – అర్ధంలేని నవ్వు ఓటి నవ్వి ఊరుకున్నాను

''అయ్యా! మిమ్మల్ని చూస్తే నమస్క రించే బుద్ధి పుట్టిందె నేను ఎన్నో గుండ్లు చూశాను కాని 'ఇంత విలువైన గుండు' ఎక్కడా చూడలేదండీ అన్నాడు తను మహా గుండు యొక్క నాణ్యం కట్టేవాడిలాగ

రాజకుమారులకి 'రాజఠీవి' అబ్బినట్లు మనకి 'గుండు ఠీవి' అబ్బి నన్ను చూసి ఏ 'క్షవర కళ్యాణానందస్వామి' అనుకున్నాడో అనుకున్నా

అంతలో బస్సు వచ్చింది లోపలికి ఎక్కి హాయిగా కూర్చుని గుండుమీద చెయ్యి వేసుకొని

# గుండు కథ

తడుముకుంటూ ''బస్సు ఎప్పటికి కదుల్తుందో కదా?'' అని ఆలోచిస్తున్నా

అంతలో ఓ పడుచు యిల్లాలు వచ్చి వెనుక నించి ఎడ పిల్లాడ్ని ఎత్తి కుదేసింది నా ప్రక్కనే, చంటాణ్ణి పదిలంగా నా వళ్ళో వదిలేసి ''జరగండి, అలా దిక్కులు చూస్తారేమిటి?'' అని నా మొహంవైపు చూసి ఆశ్చర్యపోయి నన్ను తోసి కూర్చున్న మనిషి అలాగే సిగ్గుపడిపోయింది

ఆవిడ భర్త కాబోలు వచ్చి ''ఆదేమిటే! నీ అఘాయిత్యం మండా'' అంటూ నోరు తెరుచుకుని ఉండిపోయాడు

తమాషా ఏమిటంటే ఆయనకీ గుండే!!! (నాకుమల్లే)

మొత్తానికి మరేం గొడవల్లేకుండా మరక్షి తంగా ఇల్లు చేరుకున్నాను

నన్ను చూడగానే ''చచ్చి స్వర్గాన్ని ఉన్న బామ్మగారు లాగూ చొక్కా వేసుకుని వస్తాం దేమిటి చెప్మా!!!'' అనుకున్నారుట నాన్నగారు.

నాన్నగారికి ''నా గుండు'' బామ్మగారిని స్మరణకి తెచ్చిందంటే అందులో అతిశయోక్తి ఏమీలేదు బామ్మగారి 'గుండు' చూసే యోగ్యత భాగ్యం లేకపోయినా అందరూ చెబుతూంటే విన్నాను అసలు బామ్మగారి గుండే గుండుట

ఆవిడ నెలకొకసారి, మామిడి చిగురులా మొలకెత్తిన గుండుమీద మల్లెపందిరిలాంటి తెల్ల వెంట్రుకల్ని, మంగలిని పిలిపించి అరగంటసేపు బేరమాడి నిమిషాల్లో తీయించి చేత్తో తడిమి చూసుకుని సంతృప్తి చెందిన తరువాతే డబ్బు లిచ్చేదిట (ఆయనే ఉంటే నువ్వు పావలా అడుగు దువా!?'' అన్న జోకు మొట్టమొదట ఆవిడే వేసిందట)

ఆ రోజుల్లో బామ్మగారి 'గుండు' ముందు అన్ని గుండ్లూ బలాదూరేనట కాని ఆవిడ చాలా నిరాడంబరురాలు కాబట్టి గుండుకి ముసుగు వేసే దట ఆదీకాక పూర్వం ముసుగు లేకపోతే రాత్రిళ్ళు హరికథల్లో చీకట్లో లింగభేదం తెల్సేది కాదుట

మునుపు నునుపుగా గుండు చేయించు కోడానికి మొహమాట పడినవాళ్ళు ముందు సగం గుండు చేయించుకుని మిగిలిన సగం జుట్టూ 'కొత్తిమీర కట్ట' లాగ ముడివేసుకునేవారుట (అంతకు ముందు జన్మలో ఆడవాళ్ళయినవారు ఆ ముడిలో పువ్వులు కూడా పెట్టుకునేవారట)

కొన్ని కొన్ని రోజుల తర్వాత ఇది పూర్తిగా ''అవుటాఫ్ ఫేషన్ అయిపోయింది'' ఎంతైనా గుండు అందం గుండుదే!!!! ఏమంటారూ!!!?

మర్నాడు స్వామివారి ప్రసాదం యివ్వడానికి శాంతక్కా వాళ్ళింటికి వెళ్ళాను నన్ను చూడగానే నవ్వు ఆపుకుంటూ ''ఏమిటి విశేషాలు?'' అని అడిగింది

''ఏం ఉన్నాయి! ఇదే ఓ విశేషం'' అన్నాను ఒక చేత్తో గుండు తడుముకుంటూ మరో చేత్తో లడ్డూ యిస్తూ

లడ్డూనీ – నా గుండునీ చూసిన పాప, ''అమ్మా రెండు గుండులు'' అది అసలే సిసింద్రీవాటం అది అలా అంటే నాకు మహా సిగ్గేసింది.

''తప్పు, తంబు మామయ్యని గుండు అనొచ్చా?'' అని శాంతక్క వెంటనే పాపని కొప్పడేసింది

అది వింటేగా? మిరపకాయ సరుకు

''తంబు మామయ్య కాదు గుండు మామయ్య'' అంది తప్పట్లు కొడుతూ

శాంతక్క నవ్వుతూనే ''తప్పు గుండు అనకూడదు'' అని మళ్ళీ వన్స్‌మోర్‌గా నవ్వింది నాకేమో ఉడుకుమోత్తనం వచ్చింది

''అమ్మా, మొన్న సినిమాలో ఈ గుండు గాడే కదే చాకు పట్టుకుని అందర్నీ ఏడిపించాడు?'' అని మళ్ళీ మొదలెట్టింది పాప (దానికి వస ఎక్కువ పోశారేమో చిన్నప్పుడు?)

అర్జంటుగా ఏదో జ్ఞాపకం వచ్చినట్టు ''ఫుట్‌బాల్ మేచ్‌కి వెళ్ళాలి'' అని లేచాను పాప బాధ భరించలేక

''నేనూ వస్తాను తీసుకెళ్ళవా!?'' మారాం చేసింది అది

తీసుకెళ్ళనంటే ఇంకేమన్నా ఉందా? చచ్చి నట్లు 'సరే' అన్నాను (దారిలో అల్లరి చెయ్యనని ముందరే దానిచేత వప్పించి)

మేం వెళ్ళేసరికే చాలమంది జనం వచ్చి కూర్చున్నారు మేచ్ మొదలయ్యింది పాప అల్లరి కూడా మొదలయ్యింది

''గుండు మామయ్యోయ్'' అంది గట్టిగా జనం అంతా నావైపు చూశారు అంటీ గుండు నాకదోలా అనిపించింది అందులోనూ మా వెనక

# గుండు కథ

**ఆంధ్ర సచిత్ర వారపత్రిక 1962 జూలై 6 సంచిక నుంచి**

అంతా మా కాలేజీ అమ్మాయిలే కూర్చున్నారు

తను చేసే అల్లరికే అందరూ నవ్వుతున్నారు కద్దా అని "గుండు మామయ్యోయ్" అంది మళ్లీ గొప్పగా — గట్టిగా

ఇదే సమయం అనుకుని నామీద పూర్వం కోపంగా ఉన్న అమ్మాయిలు కొందరు కష్టపడి చెమటోడ్చి మరీ నవ్వారు

నాకు నామోషీ అనిపించింది "ఏమిటి?" అని అడిగేశాను కోపంగా

"ఇక్కడ చీనులున్నాయి" అని రెండో ప్రక్కకు వచ్చి కూర్చుంది

ఈ లోపులో ఒక 'గోల్' అయింది

ఉన్నట్టుండి "గుండు మామయోయ్" అంది మళ్లీ

ఇంక లాభంలేదు దీన్ని మంచితనంతోనే సాధించాలని అనుకుని మచ్చికచేసుకోడానికి వెంటనే చేక్‌లెట్ ఒకటిచ్చాను

పాపం అది మంచిపిల్లే! అల్లరి చెయ్యకుండా చాక్‌లెట్ తింటోంది మాచ్ మంచి పట్టులోకి వచ్చింది "గోల్" అవ్వబోయి, మానెయ్యబోయి మళ్లీ అయిపోతుందేమో అని పిస్తుంది నా ప్రక్కన ఉన్న ఆయన తుమ్మనా వద్దా అని చాలాసేపు ఆలోచించి చివరకు 'గోల్' అయ్యాక తుమ్ముదాం అని వాయిదా వేసుకున్నాడు

"గుండు మామయ్యోయ్"

నా నోటంపట మాట లేదు

బ్యాక్‌గ్రౌండ్‌లో నవ్వులు

"చాక్‌లెట్ అయిపోయింది"

వెంటనే మరో చాక్‌లెట్ తీసి పాపనోట్లో పెట్టేశాను

అంతలో "టప్ టప్" అని ఏమిటో చిన్న చిన్నవి నా గుండుమీద పడ్డట్టు నాకు అనుమానం వేసింది వెనక్కి తిరిగి చూశాను అందరూ మ్యాచ్ చూస్తున్నారు మళ్లీ ఇటు తిరిగాను ఇంకో మూడు, నాలుగు పడ్డాయి ఏమిటి? అని పక్కల్ని చూశాను కనిపించినవి బటాణీలు

వెనక్కి తిరిగి చూశాను మా పక్కింటి అమ్మాయి 'సురేఖ' కూడా వచ్చింది మ్యాచ్ మంచి హుషారుగా చూస్తున్నారు అందరూను అదే గోలలో పాప 'గుండు మామయ్యోయ్' అంది కాని ఎవరికి వినిపించలేదు వెంటనే నా దగ్గరున్న చాక్లెట్లన్నీ ఇచ్చేశాను దాని బాధ పడలేక.

అంతలో మళ్లీ జలజల రాలాయి నా గుండు మీద బటాణీలు – (బటాణీలే ఇంత బాధ పెడుతున్నాయి వడగళ్లవాన పడుతే? అమ్మో! అనుకున్నాను) వెనక్కి తిరిగి చూశాను దొంగ దొరికిపోయింది మా పక్కింటి అమ్మాయి నన్ను బటాణీతో కొట్టడానికి రెడీగా ఉంది నన్ను చూడగానే ఎత్తిన చేతిలో బటాణి ఏమీ తెలియనట్లు తినేసింది

మళ్లీ మ్యాచ్ చూస్తున్నాను బంతి ఆకాశంలోకి కొట్టేశాడెవడో సరిగా కావాలని నా మీద పడాలనే కొట్టాడెమో అనిపించింది బంతి నా గుండుమీద పడుతుందేమోనని అనుమానం వచ్చి గబుక్కున రెండు చేతుల్తో గుండు కప్పేసుకుని ఒక్కసారిగా తల వంచేశాను అయితే బంతి నా వైపు రాలేదు మా వెనుక కూర్చున్న కోమలాంగులు గొల్లున నవ్వారు ఇంక అక్కడ కూర్చోలేక బయటకు వచ్చేశాను

'గుండు' అంటే అందరికీ ఎందుకింత లోకువ అని నాకు ధర్మసందేహం వచ్చింది. ఎందుకైనా మంచిదని అద్దంలో మరోమారు చూసుకున్నాను

సినిమాల్లోలాగా అద్దంలో నా బదులు నా అంతరాత్మ కనుపించింది నన్ను చూసి నవ్వింది చిరాకేసి "యూ టూ బ్రూట్" అన్నాను భారంగా.

"నాయనా అందంగా ఉన్నాననుకోవడం మానవుడి మొదటి పొరబాటు దానికితోడు అద్దాలు అబద్దాలు చెబుతున్నాయి పైపై మెరుగుల క్రాపింగులు తీసేస్తే విగ్గుతీసిన సత్యం విగ్గు తేరినట్టు బయటపడుతుంది. హాఁ! హాఁ! ఇదీ నీ నిజస్వరూపం అందానికి అర్థంలేదు హిఁ! హిఁ!" నన్ను చూసి పక్కున నవ్వేసింది నా అంతరాత్మ

అయినా నాకు నమ్మకం కుదరలేదు అదీగాక అంతరాత్మ మాట విన్నవాళ్లు ఎవరూ (నాకు తెలిసినంతవరకూ) బాగుపడలేదు నిషేపం లాంటి 'నా గుండు' అందంగా లేదుట

అసలు అందం అనేది లేదుట ఏడిసింది అంతరాత్మ అనుకున్నాను ఏమయినా గుండు మీదికి మళ్లింది నా ఆలోచన "అసలు యీ దేవుడికి గుండు సరదా ఏమిటి చెప్మా!" అని సందేహం వచ్చింది ఎంత ఆలోచించినా అంతు చిక్కలేదు

ఒకవేళ భక్తుల "గుండుల" మీద జలతరంగిణిలాఏదైనా వాయిద్యం వాయిస్తాడేమో అనుకున్నాను.

"ఏడిశావ్" అంది అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న అంతరాత్మ

ఇంతకూ "గుండు" అనేది అందంగా ఉంటుందో ఉండదో తెల్చుకోలేక పోతున్నాను ఈ వెధవ అంతరాత్మతో!

ఏమైనా మీరే చెప్పండి—గుండు అందంగా ఉండదూ!!!?

## బ్రాహ్మణ పట్టభద్రుడు చెప్పుల పని చేయుట

షికార్పూర, జనవరి 16

దత్తు అనునతడు కాశ్మీర బ్రాహ్మణుడు పంజాబు విశ్వవిద్యాలయంలో బి ఏ చదివి ఉత్తీర్ణుడయ్యెను చేతి పనులు చేసి జీవించుటలో ప్రతిష్ఠకు వచ్చే లోపము లేదనిన్ని అట్టి చేతిపనులే చాల గౌరవప్రదములనియు చేతిపనులనే విద్యావంతులలో ప్రోత్సహించుటకును నిరుద్యోగ సమస్యను పరిష్కరించుటకును ఏర్పాటు చేయబడిన ఒక సంఘములో యీ దత్తుగారు సభ్యులు ఈయన ఒక చిన్న సంచిలో నల్లరంగు గోధుమ రంగు కాటుక డబ్బీలను రెండు బ్రష్‌లను మాత్రము ఉంచుకొని వీధులవెంట తిరుగుచుండెను ఎవరికయినా బూట్సులకు మెరుగు పెట్టవలసియున్నయెడల మెరుగుపెట్టి ఒక అణా డబ్బులు తీసికొనును ఇటీవల ఒక డా॥ తన బూట్సులకు మెరుగు పెట్టినందులకై ఆ బి యే పట్టభద్రునకు ఒక రూపాయి యిచ్చెను. పాదరక్షలకు మెరుగు పెట్టుచు ఊళ్ల వెంట తిరుగుటకై పై జెప్పిన సంఘము ఇటువంటి యువకులను 6 గురిని తయారు చేసినది దత్తుగారు పెద్ద ప్రముఖులవద్దకు వెళ్లి చందాలను వసూలుచేయుచున్నారు ఈ చందాలతో కుట్టుపని, వడ్రంగం, కమ్మరం వగైరా చేతి పనులను నేర్పెడి ఖార్ఖానాలను ఏర్పాటు చేసెదరు వీరిటీవల పశ్చిమోత్తర రాష్ట్రములందును పంజాబునందును పర్యటనము చేసి యీ నెల 14 తేదీని షేక్పురా వచ్చిరి ఇచట పగలంతయును పాదరక్షల మెరుగుపెట్టి కూలి డబ్బులను గడించుకొని నిన్న సాయంకాలము బహిరంగసభలో నుపన్యసించిరి (ఆ ప్రె)

**ఆంధ్రపత్రిక 1934 జనవరి 16 సంచిక నుంచి**